ప్రజాశక్తి
బుధవారం 18 జనవరి 2023 5
శ్రీ సత్యసాయి





స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్.బసంత్‌కుమార్, ఇతర అధికారులు

పోలీసుస్టేషన్‌లో.. అనుమానాస్పద మృతి

- ఆత్మహత్య చేసుకున్నాడంటున్న పోలీసులు
- కొట్టి చంపారంటూ అనుమానాలు



మృతి చెందిన రామాంజినేయులు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో సోమవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద మృతి ఘటన చోటు చేసుకుంది. విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన ఓ వ్యక్తి స్టేషన్‌లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. అయితే పోలీసుల చిత్రహింసల వల్లనే వ్యక్తి లాకప్‌డెత్ అయ్యాడనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి... రాయదుర్గం పట్టణ పొలిమేరలోని 'పైతోట' వద్ద సోమవారం వేకువజాము 2గంటల సమయంలో ఆత్మకూరు మండలం సనప గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రామాంజనేయులు గొర్రెలు దొంగతనం చేయడానికి వచ్చారని ఆరోపిస్తూ గ్రామస్తులు పట్టుకున్నారు. వెంటనే వారిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిపై సెక్షన్ 379 కింద కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్లో ఉంచారు. వారిలో రామాంజనేయులు(28) సోమవారం వేకువజాము 2 గంటల సమయంలో పోలీస్ స్టేషన్లోని కంప్యూటర్ గదిలో అతను కట్టుకున్న లుంగీతో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కాగ అరెస్టు చేసిన వ్యక్తిని లాకప్‌గదిలో ఉంచాల్సి ఉండగా కంప్యూటర్ గదిలో ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితులను చితకబాది ఉంటారనే అనుమానాలు బలంగా విన్పిస్తున్నాయి. నిందితులను లాకప్ గదిలో కాకుండా కంప్యూటర్ గదిలో ఉంచడం, నిందితుడు లుంగీతో ఆత్మహత్య చేసుకోవడం పట్ల అధికారులు, పోలీసులు పొంతలేని సమాధానాలు చెబుతుండడం కూడా అనుమానాలకు బలాన్ని ఇస్తోంది. ఇది లాకప్ డెత్తా.? లేక ఆత్మహత్యా అన్నది అధికారుల దర్యాప్తులో తేలనుంది.

సిఐ, కానిస్టేబుళ్లు సస్పెండ్ : ఎస్పీ

పోలీసు స్టేషన్‌లో నిందితుడు మృతిపై ఎస్పీ డా॥ఫక్కీరప్ప విచారణ చేపట్టారు. మంగళవారం ఉదయం ఆయన రాయదుర్గం పోలీసు స్టేషన్‌ను పరిశీలించి, వివరాలు సేకరించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన సిఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు గంగన్న, మధు, హోంగార్డ్ రమేష్‌లను విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. కాగ మృతి చెందిన రామాంజనేయులుపై వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నాయన్నారు. పోలీసు స్టేషన్లో జరిగిన ఈ ఘటనపై కళ్యాణదుర్గం ఆర్డీవోను మెజిస్ట్రీరియల్ విచారణ జరపమని కోరమన్నారు. అనంతపురం డీఎస్పీ ఆధ్వర్యంలో శాఖాపరమైన విచారణకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

ఆర్డీవో పరిశీలన..

పోలీసు స్టేషన్‌లో నిందితుడు అనుమానాస్పద మృతిపై కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్ రెడ్డి వివరాలు సేకరించారు. శవపరీక్ష అనంతరం ఆర్డీవో మీడియాతో మాట్లాడారు. రామాంజనేయులు మతి పట్ల తాను మేజిస్టేరిజిస్ట్రియల్ విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. మతుడి కుటుంబ సభ్యుల వాంగ్మూలం తీసుకున్నామన్నారు. శవపరీక్ష నివేదిక అనంతరం పది రోజుల్లో తన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు.

గృహ నిర్మాణ పనుల లక్ష్యాన్ని అధిగమించాలి

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చూపించకుంటే చర్యలు

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో చేపట్టిన గహ నిర్మాణ పనులను ప్రణాళిక బద్ధంగా లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 52 వినతులు వచ్చాయి. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి ప్రతి శాఖ అధికారి పాల్గొనాలని ఆరోజు ఎవరికి సెలవు మంజూరు చేయవద్దని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా స్పందన అర్జీలను పరిష్కరించాలన్నారు. గహ నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపించని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక కొరత రాకుండా చూసుకోవాలన్నారు. గోరంట్ల, పెనుకొండ, రామగిరి, ముదిగుబ్బ, బుక్కపట్నం ఏపీఎం గహ నిర్మాణ లబ్ధిదారులకు డీఆర్డీఏ నుంచి ఆర్థిక పరపతి సౌకర్యం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 23, 30న గహ నిర్మాణ పనులపై సమీక్షిస్తామన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి కావాలి

ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు, త్వరగతిన పూర్తి చేయాలన్నారు. గడపగడప కార్యక్రమంలో వచ్చిన అర్జీలు మంజూరైన పనులు పూర్తి చేయాలన్నారు. 19, 21, 24న ఆధార్ కార్డు అనుసంధానం సచివాలయాలు, పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గహ నిర్మాణ శాఖ అధికారి చంద్రమౌళి రెడ్డి, డిఆర్ఓ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ ఎస్ఐగా ప్రతాప్

గుడిబండ : గుడిబండ ఎస్ఐగా ప్రతాప్ బాధ్యతలు స్వీకరించారు. ఆదోని త్రీటౌన్ స్టేషన్లో పనిచేస్తున్న ఈయన గుడిబండకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

యోగివేమన చిత్రపటం ఆవిష్కరణ

కదిరి టౌన్ : ప్రజాకవి వేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం శుభ పరిణామం అని జిల్లా విద్యాధికారి మీనాక్షి అన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం యోగి వేమన చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అనంతరం మీనాక్షి మాట్లాడుతూ కదిరి ప్రాంతంలోని 10 మండలాలకు చెందిన పాఠశాలలకు యోగివేమన చిత్రపటాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు చిన్నికృష్ణ, వేమనారాయణ, క్రిష్ణానాయక్, లతితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి సాధించవచ్చని, పరిశ్రమలు స్థాపించే యువతను ప్రోత్సహించాలని కలెక్టర్ బసంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అగ్రికల్చర్, హార్టికల్చర్ ఎక్కువగా సాగు అవుతోందని అందుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ జగనన్న బడుగు వికాసం ద్వారా యువతను ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా అధికారి చాంద్‌బాషా, డిపిఒ విజయ్ కుమార్, పెనుకొండ డివిజనల్ అధికారి శివారెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన జగనన్న ఇళ్లు

- ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా పట్టించుకోరా..?
- ఇళ్ల నిర్మాణాలు, ఇతర సమస్యలపై ఫిబ్రవరి 1, 2 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట వంటావార్పు
- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



విలేకరులతో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్


రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ పనితీరు చూస్తుంటే మరో ఐదేళ్లకు కూడా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే పరిస్థితి కనిపించడం లేదన్నారు. జిల్లాలో 68,288 ఇళ్లు నిర్మిస్తామని చెప్పి ఇప్పటి వరకు 6,045 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారన్నారు. ఇల్లు నిర్మించుకోకపోతే స్థలం రద్దు చేస్తారని అధికారులు నిబంధనలు విధించడంతో అర్హులుగా ఉన్న 28 వేల మంది తాము జగనన్న ఇళ్లు నిర్మించుకోలేమని రాత పూర్వకంగా ఇచ్చిన ప్రజా ప్రతినిధుల్లో చలనం లేకపోవడం విచారకరం అన్నారు. ఇంటి స్థలాలకు అర్జీ చేసుకున్న 90 రోజుల్లో స్థలం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మూడు సంవత్సరాలు కావస్తున్న స్థలం ఇవ్వలేదన్నారు. ఒక పక్క అధికార పార్టీ నేతలు, ధనవంతులు ప్రభుత్వ భూములు వందల ఎకరాలు కబ్జా చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ వందల కోట్లు దోచుకుంటున్నారని విమర్శించారు. అదే పేదలకు సెంటు భూమి ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ప్రభుత్వ భూములను అప్పనంగా దోచిపెడుతున్నారని విమర్శించారు. జిల్లాలో జరిగిన భూ ఆక్రమణలపై ఈ నెల 11, 12, 13వ తేదీల్లో ఆర్‌డిఓ కార్యాలయాల ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించి పేదల అర్జీలను అధికారులకు అందజేశామన్నారు. వీటిని ఇంత వరకు అధికారులు పరిశీలన కూడా చేయని దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ భూములు కాపాడాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జగనన్న ఇళ్లు పూర్తి చేసి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట 30 గంటల పాటు వంట వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సాగు భూముల సమస్యలపై ఆందోళనలు

గార్లదిన్నె, కూడేరు, పుట్లూరు, శింగనమల, యల్లనూరు, బుక్కరాయసముద్రం, పెద్దవడుగూరు మండలాల్లో 18 గ్రామాల్లో దశాబ్దాలుగా ప్రభుత్వ బీడు భూములను పేదలు సాగు చేసుకుంటున్నారని, వారికి సాగు పట్టాలు ఇవ్వాలని, లేని పక్షంలో దశల వారీగా ఉద్యమాలు చేయాల్సి ఉంటుందని రాంభూపాల్ పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ నెల 18, 19 తేదీల్లో గ్రామ సచివాలయాల వద్ద 23వ తేదీన తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

31న కార్మిక, కర్షక సదదస్సు

కార్మికులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పోరాట కార్యచరణ రూపొందించడానికి 31వ తేదీన అనంతపురం నగరంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతపురం నుంచి అమరావతి వరకు నిర్విహిస్తున్న హైవే 544డి రోడ్డు నిర్మాసితుల సమస్యలపై ఈ నెల 20, 21వ తేదీల్లో జీపుయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను సిపిఎం జిల్లా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితుడు

సొంత ఆస్తిని విక్రయించాను... న్యాయం చేయండి

ప్రజాశక్తి - హిందూపురం

తనకు పక్షవాతం వచ్చి రెండు సంవత్సరాల నుంచి నడవలేని స్థితిలో ఉన్నానని తన కుటుంబానికి చెందిన 25 సెంట్ల స్థలాన్ని కుటుంబ అవసరాల నిమిత్తం విక్రాయించానని బాధితుడు తిమ్మారెడ్డి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర రావుకు తెలిపారు. నాలుగు రోజుల క్రితం అధికార పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు, నాయకులు మున్సిపల్ ఆస్తులను పరిరక్షించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు వినతిని అందించి, పక్షవాత రోగి తిమ్మారెడ్డికి చెందిన ఆస్తి సైతం మున్సిపల్ ఆస్తి అని ఆరోపించారు. ఈ విషయంపై తిమ్మారెడ్డి పక్షవాతంతో బాధపడుతూనే బంధువుల సహకారంతో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వచ్చి కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావును కలిసి తన సమస్యను వివరించారు. తన సొంత ఆస్తిని అమ్ముకున్నానని, పరిశీలన చేసి న్యాయం చేయాలని కోరారు. సర్వే నంబర్ 422-1లో తన కుటుంబ ఆస్తి 5 ఎకరాలు ఉందన్నారు. ఇందులో గతంలోనే 4 . 75 ఎకరాల భూమిని విక్రయించి, మిగిలిన 25 సెంట్లు భూమిని తన ఆధీనంలోనే ఉంచుకున్నానని చెప్పారు. ఈ 25 సెంట్లు స్థలాన్ని తన వైద్య ఖర్చులతో పాటు తన ఇద్దరి కుమార్తెల వివాహం చేయాలని సంకల్పించి విక్రయించానన్నారు. గతంలో ఈ స్థలాన్ని పంచాయితీకి గాని పురపాలక సంఘానికి గాని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వలేదన్నారు. అయితే కొంతమంది తన స్వాధీనంలో ఉన్న 25 సెంట్లు స్థలాన్ని కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తనకు పక్షవాతం వచ్చిందని ఎక్కడ రాలేదనితెలుసుకున్న కొంతమంది స్థలాన్ని ఎలాగైనా కబ్జా చేయాలని ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. దీనిపై సమగ్రంగా పరిశీలించి పక్షవాతంతో బాధపడుతున్న తనకు న్యాయం చేయాలని మున్సిపల్ కమిషనర్ ముందు బాధితుడు కన్నీళ్ల పర్యంతం అయ్యాడు. స్పందించిన మునిసిపల్ కమిషనర్ పరిశీలన చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఎరువులకోసం రైతుల అవస్థలు



యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

ప్రజాశక్తి రొద్దం

ఎరువుల కొరత నెలకొనడంతో మండల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు ప్రభుత్వం ద్వారా అందించే యూరియా నాలుగు రోజులుగా నిల్వ లేకపోవటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. రెండు రోజులు క్రితం యూరియా స్టాకు ఉన్నప్పటికీ తక్కువగా ఉందన్న కారణంతో పంపిణీ చేయలేదు. తిరిగి మూడు లోడులు వచ్చిన తరువాత పంపిణీ చేపడతామని అధికారులు చెప్పారు. అయితే అది కూడా రాకపోవడంతో ఉన్న స్టాకును రైతులకు ఇవ్వటానికి మంగళవారం ఏర్పాటు చేశారు. అయితే ఒక్కొక్క రైతుకి ఆధార్ కార్డుకు 2పాకెట్లు చొప్పున ఇచ్చారు. మండలం మొత్తం కలిసి 270 పాకెట్ల యూరియా 130మందికి అందించినట్లు సొసైటీ సిబ్బంది తెలిపారు. యూరియా అందని రైతులు నిరాశ చెందారు.

నాణ్యతతో కూడిన ప్రథమ చికిత్స అందించాలి

చిలమత్తూరు : గ్రామీణ ప్రాంతాలలో అనారోగ్యంతో బాధపడుతూ ప్రథమ చికిత్స కేంద్రానికి వచ్చే రోగులకు నాణ్యతతో కూడిన ప్రథమ చికిత్స అందించి అవసరమైతే మండల కేంద్రంలోని పిహెచ్‌సికి రెఫర్ చేయాలని మండల వైద్యాధికారి రామక్రిష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్ఎంపిలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రథమ చికిత్స విధానంపై పలు సూచనలు చేశారు. ప్రథమ చికిత్సలో ఏవైన సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పరస్పర సహకారంతో పేద ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఆర్ఎంపిలతో ప్రజలకు సత్ సంబందాలు ఉన్నాయన్నారు. ఆ నమ్మకాన్ని కాపాడుకొనేలా వైద్యసేవలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామ్‌కుమార్, డిటి హనుమంతు, ఆర్ఎంపిలు పాల్గొన్నారు.

వేమన జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దాం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హిందూపురం : వేమన జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దామని రెడ్డి జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ముదిరెడ్డిపల్లి రెడ్డి జెఎసి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి జేఏసీ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన వేమన జయంతి ఉత్సవాలు చేపడుతున్నామన్నారు. 22వ తేదీన సుగురు సడ్లపల్లిలో వేమన విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రెడ్డి సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జెఎసి జిల్లా అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి, నాయకులు శివారెడ్డి, సోమశేఖర్ రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, నారాయణరెడ్డి, ప్రకాష్ రెడ్డి, హనుమంత రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఆర్ నరసింహారెడ్డి, గోవింద్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : ఈనెల 19న జరిగే యోగివేమన జయంతి వేడుకలను జయప్రదం చేయాలని గోరంట్ల మండలంలో రెడ్డి సామాజిక వర్గం నాయకులు కోరారు. పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో రెడ్డి సామాజిక వర్గం నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 19న జరిగే యోగివేమన జయంతిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, డీలర్ నరసింహారెడ్డి, బోర్వెల్ అశ్వర్థ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ ఓబుల్ రెడ్డి, సర్పంచి నర్సిరెడ్డి, ప్రేమ్ కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు ఆపాలని ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

నిషేధిత జాబితాలో ఉన్న స్థలంలో ఆక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను ఆపాలని హైకోర్టు ఉత్తర్వులను జారీ చేసిందని, వాటిని అమలుచేయాలని టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు టిడిపి నాయకులు పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్ నాయుడు తదితరులు మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కలిసి హైకోర్టు ఉత్తర్వుల ప్రతులను అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవపురంలో సర్వేనెంబర్ 626లో ప్లాటు నెంబర్ 5 నిషేధిత జాబితాలో ఉందన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. దీంతో గతంలో కలెక్టర్, కమిషనర్, తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్లకు అక్రమ కట్టడాలను ఆపాలని వినతిపత్రాలు అందజేశామన్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో 25వవార్డు టీడీపీ ఇన్‌ఛార్జి భీమనేని ప్రసాద్ నాయుడు హైకోర్టులో పిటీషన్ వేశారన్నారు. దీంతో నిషేదిత జాబితాలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను ఆపాలని, ఈ నెల 12వ తేదీన హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. హైకోర్టు ఉత్తర్వులలో ఎవరు అక్రమంగా నిర్మిస్తున్నారో వివరాలు సక్రమంగా లేవని అధికారులు తెలపడంతో తిరిగి సరైన ఆధారాలతో హైకోర్టుకు వెళ్లామన్నారు. దీంతో పసల ప్రవల్లిక అనే మహిళ అక్రమంగా చేపడుతున్న నిర్మాణాన్ని ఆపాలని మంగళవారం హైకోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చాయని, ఆ ఉత్తర్వులను అధికారులకు అందజేశామని టీడీపీ నాయకుడు భీమనేని ప్రసాద్‌నాయుడు తెలిపారు.

శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించండి

లేపాక్షి : మండల పరిధిలోని కల్లూరు శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు కల్పించాలని కెవిపిఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్యకు అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలని, బోరు బావిని తవ్వించి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ప్రభు, సాయినాథ్, మంజు, నవీన్, బన్నీ, రఘు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు

మడకశిర: శ్రీ కృష్ణదేవరాయల పాలన నేటి తరానికి ఆదర్శమని బలిజ సామాజిక వర్గం నాయకులు పేర్కొన్నారు.మడకశిర పట్టణంలో తేరువీధిలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో శ్రీకృష్ణదేవరాయల 552వ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాపు, బలిజ సామాజిక వర్గం నాయకులు మాట్లాడుతూ రాయల పాలన గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసప్ప, వేదాచలం వెంకటేష్, వెంకట్రామి, సోము, శ్రీనివాసులు, రామాంజనేయులు, తిమ్మరాజు, శ్రీనివాసులు, మేఘన, హోటల్ రమేష్, రవి, లక్ష్మీపతి, సూరి, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

అడవులను కాపాడుకుందాం

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో దాదాపు మూడు లక్షల ఎకరాలలో ఉన్న అడవులను కాపాడుకుందామని పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు కోరారు. మంగళవారం పుట్టపర్తి గ్రీవెన్స్ సెల్లో ఆయన అధికారులకు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని అడవులు అగ్నికి ఆహుతవుతున్నాయన్నారు. అడవులను కాపాడుకోవటానికి ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బసంత్ కుమార్ను కోరానని చెప్పారు.

వేమన జయంతి ఏర్పాట్ల పరిశీలన

గాండ్లపెంట : మండల పరిధిలోని కటారుపల్లిలో నిర్వహించే యోగివేమన జయంతి ఉత్సవాల ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యోగివేమన ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జయంతి ఉత్సవాల నిర్వహణను అధికారికంగా ప్రకటించడంతో ఈ నెల 19వ తేదీన టూరిజం శాఖ మంత్రి ఆర్కే రోజా, అధికారులు హాజరై ఉత్సవాలను ప్రారంభిస్తారని చెప్పారు. ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవి, ఎంపిపి జగన్మోహన్, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఫయాజ్ అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, స్థానిక సర్పంచి గంగోజమ్మ ఉత్పన్న నాగభూషణం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నేడు మెగా రక్తదాన శిబిరం

కదిరి టౌన్ : టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. ఈ రక్తదాన శిబిరాంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ వినియోగదారులతో అభిప్రాయ సేకరణ

కదిరి టౌన్ : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రతిపాదించిన వార్షిక ఆదాయం విద్యుత్ వినియోగం ధరలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం నుండి ఈనెల 21వ తేదీ వరకు కదిరి డివిజన్ పరిధిలోని కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, పెనుగొండ మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులతో నూతన విద్యుత్ ధరలు, ప్రతిపాదనలపై మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4 : 30 గంటల వరకు జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు. ఈ మేరకు వినియోగదారులు ప్రజాభిప్రాయంలో పాల్గొని తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చునని చెప్పారు.

నేటి నుంచి రహదారి భద్రత వారోత్సవాలు

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రహదారి భద్రతా వారోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 24 వరకు నిర్వహిస్తున్నట్లు మోటరు వాహనాల తనిఖీ అధికారి వరప్రసాద్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా వాహన చోదకులకు భద్రత సూచనలు ఇవ్వనున్నట్లు చెప్పారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా రోజుకోక మండలంలో ఒక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా 19నకదిరి పట్టణంలో వాహన ర్యాలీ ఉంటుందన్నారు. ఈ ర్యాలీలో కదిరి లారీ, మిని లారీ, టాక్సీ యజమానులు, డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ధర్మవరం టౌన్ : మండల పరిధిలోని కుణుతూరు గ్రామానికి బుక్కచెర్ల ఆదినారాయణ(47) ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి మంగళవారం మృతుడు ఆదినారాయణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార విభాగపు రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెస్త శ్రీనివాసులు, ధర్మవరం రూరల్ కన్వీనర్ నాగసుధాకర్ రెడ్డి, కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు పేరూరు శ్రీనివాసులు, రామాంజి తదితరులు ఉన్నారు.

పెనుకొండ : నగర పంచాయతీ పరిధిలోని షీఫారం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త వడ్డే పెద్దనారాయణప్ప రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతునికుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా శశిభూషణ్ టీడీపీ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గం ఉపాధ్యక్షులు రామలింగ నాయుడు తన వంతుగా మృతుని కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గం కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, మండల కన్వీనర్ సిద్దయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెప్ప తిరునాళ్లు

నల్లచెరువు : మండల పరిధిలోని పంతులు చెరువు గ్రామ చెరువులో మంగళవారం నిర్వహించిన తెప్పతిరుణాళ్ల ఉత్సవంలో ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన గంగ పూజ నిర్వహించి చీర, సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల వ్యవసాయ అవసరాలకు పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పండుగ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రామస్తులకు, నాయకులకు, ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి పాఠశాలల అధిపతి పవన్ కుమార్ రెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి, బసిరెడ్డి విశ్వనాథరెడ్డి, హరినాథ్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు జయచంద్రారెడ్డి, మాజీ సర్పంచి రవికుమార్ రెడ్డి, లక్ష్మీపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఓబుల దేవర చెరువు : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కొండకమర్ల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గజ్జికుంటపల్లి తండాలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాఖ ఫీల్డ్ ఆఫీసర్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎటిఎం, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ గురించి అవగాహన కల్పిచారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు క్యాషియర్ సందీప్, మెసెంజర్ ప్రసాద్, నిత్యనిధి ఏజెంట్ కె. దామోదర్, గ్రామస్తులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మహిళలు

పార్టీ సేవలను ప్రజలకు వివరించండి : బికె



సమావేశంలో మాట్లాడుతున్న బికె. పార్థసారథి

ప్రజాశక్తి మడకశిర

గతంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో చేసిన సేవలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని టిడిపి సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి నాయకులు, కార్యకర్తలను కోరారు. మంగళవారం మడకశిర పట్టణంలోని యాదవ కళ్యాణమండపంలో రియల్ టైం స్ట్రాటజీ శిక్షణ కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బికె పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడు అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందామన్నారు. ఈసందర్భంగా ఆయన గ్రామ, పట్టణాల రూపురేఖలు మార్చారని చెప్పారు. అయితే ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి ఎక్కడా కన్పించడం లేదని విమర్శించారు. ఈ ప్రభుత్వ పాలనను ప్రశ్నిస్తే కక్ష సాధింపులు చేయడం, తప్పుడు కేసులు బనాయించడం వంటివి చేస్తున్నారని ఆరోపించారు. ఈనేపథ్యంలో టిడిపి ఆధ్వర్యంలో చేపడుతున్న ఆర్టిఎస్ పార్టీ శ్రేణులను అన్ని రంగాల్లో చైతన్యపరిచి కార్యోన్ముఖులను చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, జిల్లా మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు, నియోజకవర్గంలోని ఐదు మండలాల కన్వీనర్లు, పట్టణ అధ్యక్షులు తదితరులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ 'గుండుమల'

ఓబవ్వ ఆశయాలు కొనసాగిద్దాం

ప్రజాశక్తి - అమరాపురం

విజయనగర సామ్రాజ్యంలో ఎదురులేని వీర వనితగా పోరాడిన ఓబవ్వ ఆశయాలను కొనసాగించాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం ఓబవ్వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల మాల సోదరులు డప్పు వాయిద్యాలతో కళాశాలతో వెండి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రత్నం, జిల్లా మాల మహానాడు ఐక్యవేదిక అధ్యక్షులు శంకర్,ఉపాధ్యాయులు తిప్పేస్వామి, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, రాజప్ప, శివలింగప్ప, జై రామప్ప, హనుమంతరావు, నాయకులు ఉమేష్, నరసింహమూర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - పెనుకొండ

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీని బుధవారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సవితమ్మ మంగళవారం గ్రౌండ్ను పరిశీలించి టోర్నీ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాధవ నాయుడు, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, మిలటరీ నారాయణ, నాగరాజు రెడ్డి, అడదాకులపల్లి మాజీ సర్పంచి ప్రసాద్ త్రివేంద్ర నాయుడు, అరుణ్ రెడ్డి, మాజీ వైస్ సర్పంచి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



టోర్నీ బ్రోచర్లు విడుదల చేస్తున్న నాయకులు

మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య


రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలబడిన వాహనాలు

ప్రజాశక్తి - రొద్దం

మండల కేంద్రంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య ఎక్కువవుతోందని స్థానికులు వాపోతున్నారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక వైస్సార్ విగ్రహం వద్ద ఒక ప్రక్క లారీ, మరోపక్క అదే స్థలంలోకి బస్సు, వెనుకవైపు నుంచి కట్టెల లోడుతో ట్రాక్టర్ రావడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పాటు రోడ్డుపక్కన ఎక్కడ వాహనాలు అక్కడ పార్క్ చేయడంతో సమస్య తీవ్రమైంది. దీంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలోనిఆంజనేయ స్వామి దేవాలయం వద్ద నుంచి వైస్సార్ సర్కిల్ వరకు దాదాపు 4వందల మీటర్ల వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలి

కదిరి టౌన్ : పేదల గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షలు మంజూరు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. జనవరి 17 నుండి ఫిబ్రవరి 6 వరకు జరిగే సిపిఐ పోరుబాటకు సంబంధించిన గోడపత్రికలను ఈ సందర్భంగా విడుదల చేశారు. అనంతరం సిపిఐ నాయకులు కదిరప్ప మాట్లాడుతూ జగనన్న ఇంటి నిర్మాణానికి ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోవని దీనిని రూ. 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి లియకత్ అలీ, సహాయ కార్యదర్శి మనోహర్, రైతుసంఘం తాలూకా అధ్యక్షుడు మధు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుడాలగొంది రమణ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

నవోదయ విద్యాలయాల్లో ఆరవ తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ బసంత్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 31వ తేదీ లోపు నవోదయ విద్యాలయాల సమితి వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులను అప్ లోడ్ చేయాలన్నారు. ఈ ఏడాదికి 29 తేదీన పరీక్షలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు లేపాక్షి నవోదయ ప్రిన్సిపల్ నాగరాజు ఫోన్ నెంబరు 9485235387 కు ఫోన్ చేసి వివరాలు కనుక్కోవచ్చన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పెనుకొండ : పట్టణంలోని నామరామయ్య ఫంక్షన్ హాల్లో ఎకెసిఎఫ్ ట్రస్ట్ అధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 5 వ ఉచిత కంటి శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ మెగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, ట్రస్టు సభ్యులు అర్షద్ అలీ అవేజ్ ,ఉబేదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను జయప్రదం చేయండి

ధర్మవరం టౌన్ : నందమూరి తారకరామారావు 27వ వర్ధంతి. వేడుకలను జయప్రదం చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 9 : 30 గంటలకు ఎన్టీఆర్ సర్కిల్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అన్నక్యాంటీన్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమాలలో టీడీపీనాయకులు, కార్యకర్తలు, తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, తెలుగు మహిళా నాయకురాళ్లతదితరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం


జ్యోతుల ఉత్సవంలో ఊరేగింపు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవాలను తొగటవీర క్షత్రియపట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల నుంచి శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతులు, కలిశాలతో పట్టణంలో ఊరేగించారు. ఆ తరువాత పట్టణంలోని 39 కమిటీలు ఏకతాటిపైకి వచ్చి అర్ధరాత్రి నుంచి 500 అమ్మవారిజ్యోతులను భక్తులు తలపై ధరించి ఆయా ప్రాంతాల నుండిమేళ తాళాలతో మంగళవారం తెల్లవారుజామున దుర్గమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. అక్కడ హోమగుండం ప్రవేశానంతరం ఆలయంలో అమ్మవారి ఎదుట జ్యోతులను దింపారు. వీటిని తిలకించడానికి ధర్మవరం చుట్టుపక్కల ప్రాంతాలనుండే కాక ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన తొగటవీర క్షత్రీయులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సేవాసంఘం గౌరవాధ్యక్షులు గడ్డం శ్రీనివాసులు, అధ్యక్షులు బండారు ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి శంకర యుగంధర్, సహాయకార్యదర్శి గడ్డం రంగ తదితరులు పాల్గొన్నారు.

పేకాట జూదరులు అరెస్టు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని పలు ప్రాంతాలలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు వన్టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ మహమ్మద్ రఫీ, ఎఎస్ఐ పుట్టప్పలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేకాట జూదరుల అరెస్టు వివరాలను వెల్లడించారు. సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా సత్యసాయి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మవరంలో ఎలాంటి జూదాలు. కోడిపందేటు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని కేశవనగర్, పోతిరెడ్డి గ్రౌండ్, రమణ ఇంటి ఎదుట బహిరంగ ప్రదేశాలలో పేకాట ఆడుతున్న శిబిరాలపై దాడులు నిర్వహించి 12మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. వారి వద్ద నుంచి రూ.1.73,020 నగదును స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సిఐ, తదితరులు

కర్నాటక మద్యం స్వాధీనం

గోరంట్ల : మండలంలోని మలసముద్రం పంచాయతీ కోరేవాండ్లపల్లి క్రాస్ వద్ద మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో బాగేపల్లి నుండి 288 కర్నాటక మద్యం ప్యాకెట్లు తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు.

బ్లాక్ మెయిలర్పై చర్యలకు వినతి

చిలమత్తూరు : వారం రోజులుగా తమను బ్లాక్ మెయిల్ చేస్తూ మండల వైద్యాధికారిపై ఒత్తిడి తెస్తూ తమ ప్రథమ చికిత్స కేంద్రాలపై దాడులు చేయిస్తూ భయాందోళనకు గురిచేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ఆర్ఎంపి సంఘం నాయకులు స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వినోద్ కుమార్ అనే వ్యక్తి తమను బెదిరిస్తున్నారన్నారు. తాము ప్రజలకు చేరువగా ఉంటూ అనేక సేవలు అందిస్తున్నామని అలాంటి తమపై ఇలా బెదిరింపులకు దిగడం సరికాదని అన్నారు. తమను బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ, ఆర్ఎంపిల సంఘం అధ్యక్షులు శశిధర్ రాజు, కార్యదర్శి గురుప్రసాద్, కోశాధికారి విశ్వనాథ్ రెడ్డి, పెద్దన్న, వెంకటేశ్వర్లు, లక్ష్మినారాయణ, శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాసంఘం డబ్బులు స్వాహా

ఫిర్యాదు చేసిన బాధిత మహిళలు

గుడిబండ : మండల పరిధిలోని రాళ్లపల్లి పంచాయతీ మదిగుబ్బ గ్రామంలో వెలుగు మహిళ సంఘ సభ్యుల డబ్బులు గతంలో పనిచేసిన సిసి స్వాహా చేశాడని ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా బాధిత మహిళలకు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. గ్రామంలో విజయలక్ష్మి మహిళాసంఘం నడుపుకుంటున్నామన్నారు. గతంలో సిసిగా పనిచేసిన వెంకటేష్ సంఘం ప్రెసిడెంట్, కార్యదర్శి ద్వారా ఆరు లక్షల రూపాయలు బ్యాంకులో డ్రా చేయించి ఆ డబ్బును సంఘ సభ్యులకు పంచకుండా స్వాహా చేశారని ఆరోపించారు. 2021లో ఈడబ్బులు తీసుకున్న సీసి 'మీ డబ్బులు మీకు ఇస్తాన'ని చెబుతూ వచ్చాడని అన్నారు. ఇటీవల ఇక్కడి నుండి మరో ప్రాంతానికి బదిలీపై వెళ్ళాడని డబ్బుల విషయం పలుమార్లు అడిగినా స్పందించడం లేదని వాపోయారు. సంఘంలో ఉన్న పదిమంది సభ్యులు మళ్లీ రుణాల కోసం వెలుగు అధికారులు కలిస్తే వెనుకటి అప్పును చెల్లిస్తే కొత్త రుణాలు ఇస్తామని చెబుతున్నారని అన్నారు. ఈవిషయంపై పోలీసులు జోక్యం చేసుకుని సిసి వెంకటేష్ స్వాహా చేసిన ఆరు లక్షల డబ్బులను తమకు ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు లక్ష్మమ్మ, నాగమణి, హనుమక్క, గంగమ్మ, అక్కమ్మ తదితరులు కోరుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఓబుల దేవర చెరువు : ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ సత్యసాయి జిల్లా కమిటీ రూపొందించిన 2023 సంవత్సరపు క్యాలెండర్ను తహశీల్దార్ కె.శ్రీధర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు కె. అక్కులప్ప నాయక్, జిల్లా అధ్యక్షుడు ఎస్ రఘునాథ నాయక్, సహాయ కార్యదర్శి దివాకర్ నాయక్, అనిల్ ప్రసాద్ నాయక్, ధోని నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన 2023 సంవత్సర క్యాలెండర్ను, డైరీని ఆ శాఖ అధికారులు మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్వి కృష్ణారెడ్డి చేతుల మీదుగా క్యాలెండర్ను, డైరీని ఆవిష్కరించారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల అసోసియేషన్ , ఆధ్వర్యంలో ఈ క్యాలెండర్ను రూపొందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి నివారణ జిల్లా అధికారి డాక్టర్ తిప్పయ్య, ఎన్యుహెచ్ఎం డాక్టర్ కెసి. కుల్లాయప్ప నాయక్, నేషనల్ హెల్త్ మిషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు,కదిరి

O.S.NO:438/2018.

Between:
B.ఓబుళరెడ్డి S/o సిద్దారెడ్డి D.No: 9-152 ఓ.బి.ఆర్.రోడ్డు తలుపుల, తలుపుల మండలం ...వాది
మరియు
To
T.సూర్యనారాయణరెడ్డి S/o రామిరెడ్డి, యర్రసానిపల్లి, తలుపుల మండలం ... ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

పై దావాలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తమై 20-02-2023 వ తేదిన వాయిదా వేసినారు. కావున మీరు 20-02-2023 వ తేదిన ఉదయం 10:30 గం॥లకు మీరు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు కాని యెడల పై దావాను మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది: 20/02/2023
స్థలం:కదిరి

ఎ.చంద్రశేఖర్ రెడ్డి, బి.ఎ.,బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ 11వ అదనపు జిల్లా మరియు సేషన్స్ వారి కోర్టు తెనాలి

A.S.No: 112/2016

బిట్వీన్:
తురగా బాబురావు ...అప్పిలెంట్
ఎదిరి
సిరిపురపు వెంకట శ్రీధర్ @ శ్రీధర్ మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్
R7, తురగా గణేష్ S/o లేటు కామేశ్వరరరావు R/o డోర్.నెం. 3-49-25, గోపురం రోడ్, పుట్టపర్తి,శ్రీ సత్యసాయి జిల్లా.
R8, తురగా సీతామహాలక్ష్మి, w/o లేటు ప్రసాద్, R/o డోర్.నెం. 2-3-512/ఎ/149, చెన్నారెడ్డి నగర్, అంబర్పేట, హైదరాబాద్-13.
R9, తురగా బాలాజీ, S/o లేటు ప్రసాద్, R/o డోర్.నెం. 2-3-512-/ఎ/149, చెన్నారెడ్డినగర్, అంబర్పేట, హైదరాబాద్-13.
R10, తురగా లీలా, D/o లేటు కామేశ్వరరావు R/o డోర్.నెం. 10-2-25, కవిరాజా పార్క్ రోడ్, నందులపేట, తెనాలి.

పై నెంబరు అప్పీలులో మీకు కోర్టుద్వారానూ, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు సమన్లు చేయించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ 20-01-2023వ తేదీన వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ అక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు అప్పీలును మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా తేది: 20-01-2023.

సి.హెచ్.రాధాకృష్ణ
అడ్వకేటు, తెనాలి.

మహారాజశ్రీ ప్రన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు,కదిరి

O.S.NO:337/2019.

Between:
నారికి ఓబులేసు, తండ్రి శిద్దప్ప.... ...వాది
Residing of D.No:31-210, బొలుగుట్టపల్లి (గ్రామం) H/o సోమయాజులపల్లి గాండ్లపెంట-పోస్టు మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా
మరియు
పెద్దమర్ల చిన్నబయప్ప @ బయప్ప, తండ్రి పెద్ద వీరయ్య, D.No:3-67 వేపలకుంట గ్రామం H/o సోమయాజులపల్లి గాండ్లపెంట-పోస్టు మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా ... ప్రతివాది

ప్రతివాదికి సమను

వా ఇందుమూలముగా ప్రతివాదికి తెలియజేయడమేమనగా వాది తన దావాలో కనబరచిన ప్రాంసరి నోటు బాకీ మొత్తమును రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసుకున్నాడు. కావున సదరు దావాలో మీ హాజరు నిమిత్తము 24-01-2023 వ తేదిన వాయిదా వేసినారు. సదరు తేది నాడు మీరు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో హాజరు అయి మీకు ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది: 24/01/2023
స్థలం:కదిరి

కె.చౌడప్ప, బి.ఎస్సీ.,బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి
శ్రీ సత్యసాయి జిల్లా సెల్:9966350645

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL JUNIOR CIVIL JUDGE, HINDUPURAM.

0.S. 434/2019

Between:
Padmaraju ...PLAINTIFF
AND
K. L. Badarinath and 3 others ...DEFENDANTS

NOTICE TO THE DEFENDANTS NO. 1 to 3

1.K.L. Badarinath S/o Katta sheshaiah,
2.K.S. Raghuramaiah, S/o S/o Katta sheshaiah,
3.Chandramohan S/o Katta sheshaiah,
Dl to D3 are residing at D.No. 129, 1st Cross, Panduranganagar, Hindupuram, Sri Sathya Sai Dist. ...DEFENDANTS No. 1 to 3

The plaintiff filed the above suit for permanent injunction on the file of Additional Junior civil judge court Hindupur against you. The above O.S.434/2019 posted to 17-2-2023 for your appearance. If you failed to appear before the above court on 17-2-2023 at 10:30 AM in person or through an advocate you will be set ex-parte and the matter will be decided in your absence.

(By Order of the Court)

C. NAGARAJU
Advocate for plaintiff Hindupur

మహారాజశ్రీ ప్రన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు,కదిరి

I.A.NO:822/2019 in O.S.NO:337/2019.

Between:
నారికి ఓబులేసు, తండ్రి శిద్దప్ప, D.No:31-210, బొలుగుట్టపల్లి (గ్రామం) H/o సోమయాజులపల్లి, గాండ్లపెంట-పోస్టు మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా ...పిటిషనర్-వాది
మరియు
పెద్దమర్ల చిన్నబయప్ప @ బయప్ప, తండ్రి పెద్ద వీరయ్య, D.No:3-67 వేపలకుంట గ్రామం H/o సోమయాజులపల్లి గాండ్లపెంట-పోస్టు మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా ... రెస్పాండెంట్-ప్రతివాది

రెస్పాండెంట్కు నోటీసు

పై దావాలో పిటిషనులో కనబరచిన ప్రాంసరి నోటు బాకీ మొత్తమును రాబట్టు నిమిత్తమై రెస్పాండెంట్-ప్రతివాదికి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై కోర్టులో అటాచ్మెంట్ చేసుకున్నాడు. సదరు పిటిషనులో మీ హాజరు నిమిత్తము 24-01-2023 వ తేదిన వాయిదా వేసినారు. సదరు తేది నాడు మీరు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో హాజరు అయి మీకు ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావాలో పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూలు

అనంతపురం ఆర్॥డి. ప్రస్తుతం హిందూపురం ఆర్॥డి. శ్రీ సత్యసాయి జిల్లా, కదిరి, సబ్॥రి॥డి॥కి చేరిన మడుగు వారిగొంది, రెవెన్యూ గ్రామ పరిధిలో గాండ్లపెంట మండలంలో.

Govt	S.No	A.C
Dry	59-4	2.74 సెంట్లు

Bounded By:
తూరు: పి.సోమశేఖర్ మరియు ఇతరుల భూమి,
దక్షిణం: పి.శేషయ్య భూమి, **పడమర:** జి.రెడ్డెప్ప భూమి,
ఉత్తరం: జి.రెడ్డెప్ప భూమి

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది: 24/01/2023
స్థలం:కదిరి

కె.చౌడప్ప, బి.ఎస్సీ.,బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి
శ్రీ సత్యసాయి జిల్లా సెల్:9966350645